సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 14 । మార్చి । 2023



ముగిసిన రబీ
జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి చివరి నాటికి రబీ సీజన్ ముగిసింది. జిల్లాలో ఉద్యాన, వ్యవసాయ పంటలు కలిపి 1,24,811 హెక్టార్లలో సాగయ్యాయి. - 8లో



హత్య కేసులో ముగ్గురి అరెస్ట్
సిద్దవటం మండలం ఉప్పరపల్లెలో ఆదివారం రూ.300 కోసం దాడి చేసి హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులను సోమవారం అరెస్టు చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
35.7 /19.5

వాతావరణం
జిల్లాలో సోమవారం 19.5 - 35.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

- టీచర్స్ 91.31శాతం, పట్టభద్రులు 72.01శాతం నమోదు
- జిల్లాలో ఉదయం నుంచి బారులు తీరిన ఓటర్లు
- పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ
- పులివెందులలో ఓటుహక్కు వినియోగించుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడపలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిల్చొన్న పట్టభద్రులు





ఓటర్లను తనిఖీ చేస్తున్న పోలీసు



చంటిబిడ్డతో ఓటు వేయడానికి..



ఓటు వేయడానికి వస్తున్న దివ్యాంగుడు

పోలింగ్ ప్రశాంతం

సాక్షి ప్రతినిధి, కడప : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయాన్నే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. సాధారణ ఎన్నికలను తలపించే రీతిలో, ఎండను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పట్టభద్రులు, ఉపాధ్యాయులు పోటెత్తారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచే భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు ప్రాధాన్యతను తెలిపారు. ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించడంతో పోలింగ్ ఆలస్యమైంది. ప్రధానంగా పట్టభద్రులకు 49 మంది అభ్యర్థులు పోటీలో ఉండటం, వారందరి పేర్లను పరిశీలించుకుని, నచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఓటువేసేందుకు కాస్త సమయం తీసుకుంది. కాగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎస్ అన్బురాజన్ స్వయంగా పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

టీచర్ల పోలింగ్ భారీగా నమోదు...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు భారీ ఎత్తున పోలింగ్‌లో పాల్గొన్నారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోటీపడ్డారు. జిల్లా వ్యాప్తంగా 7,461 ఓట్లు ఉండగా అందులో 6,813 ఓట్లు పోలయ్యాయి. వెరసి జిల్లాలో 91.31శాతం ఓటింగ్ నమోదైంది. పురుషులు 90.07శాతం ఓటింగ్‌లో పాల్గొనగా, మహిళా ఉపాధ్యాయులు 93.10శాతం ఓట్లు నమోదయ్యాయి. అట్లూరు, పెద్దముడియం, రాజుపాళెం, పెండ్లిమర్రి, లింగాల మండలాలల్లో 100 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. మరో 25 మండలాలు 90శాతం పైబడి ఓటింగ్ నమోదు కాగా, 6 మండలాలు మాత్రమే 90శాతం లోపు ఓటింగ్ నమోదైంది. టీచర్స్‌తో పోల్చుకుంటే గ్రాడ్యుయేట్స్‌లో కొంచం లేజీనెస్ స్పష్టంగా కన్పించింది. జిల్లా వ్యాప్తంగా 72.01శాతం పోలింగ్ నమోదైంది. 81,317 మంది గ్రాడ్యుయేట్స్ ఓటు హక్కు కలిగా ఉండగా, వారిలో 58,560 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోలింగ్ నమోదు కావడం విశేషం.

పులివెందులలో ఓటు వేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పులివెందులలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా కడపలో ఓటు వేశారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి యర్రగుంట్ల పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకోగా, ఎమ్మెల్సీ డీసీ గోవింద్‌రెడ్డి బద్వేల్‌లో,ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పెద్దముడియంలో ఓటు వేశారు. ప్రజాప్రతినిధులు ఓటర్లుతోపాటు క్యూలైన్లుల్లో నిల్చొని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

16న తేలనున్న భవితవ్యం....

గడిచిన నెల రోజులుగా ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాల్లో అభ్యర్థులు మునిగితేలారు. ఆయా అభ్యర్థుల భవితవ్యం సోమవారం బ్యాలెట్ బాక్స్‌ల్లో నిక్షిప్తం అయింది.బ్యాలెట్ బాక్స్‌లు జిల్లా కేంద్రానికి చేర్చి, అన్నీ అనంతపురం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించనున్నారు. ఈనెల 16న అనంతపురంలో కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. అదే రోజు రాత్రికి టీచర్స్ ఎమ్మెల్సీ ఫలితం వెలువడనుంది. 17వ తేది రాత్రి లేదా 18వ తేదీ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఫలితం వెల్లడి కానున్నట్లు అధికారులు వివరిస్తున్నారు.

గెలుపు నాదే

మైదుకూరు: మైదుకూరులో జరిగిన ఉపాధ్యాయుల ఎన్నికల పోలింగ్‌ను వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ సరళిని గమనిస్తే మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే తాను విజయం సాధిస్తానని అన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, పట్టభద్రులకు కృతజ్ఞతలు

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో సహకరించిన వైఎస్సార్‌సీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, పట్టభద్రులకు ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. పోలింగ్ సరళిని బట్టి వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించబోతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించిన అధికార యంత్రాంగం, పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

• ఓటు హక్కు వినియోగించుకున్న నేతలు



ఎర్రగుంట్లలో ఓటు వేయడానికి క్యూలో నిలుచున్న ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి






కడపలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, పోరుమామిళ్లలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పెద్దముడియంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, కడలో టీడీపీ పట్టభద్రుల అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డి ఓటుహక్కు వినియోగించుకున్నారు

ఎన్నికల ప్రక్రియ పరిశీలన

కడప సిటీ : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా 38 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలు, 93 పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగిందన్నారు. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జరిగిందన్నారు. కాగా సోమవారం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములో వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా పాల్గొన్నారు.

అధికారులకు ఎస్పీ కృతజ్ఞతలు

కడప అర్బన్: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకుని ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు ముగిసేందుకు కృషి చేసిన పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులకు, ప్రజలకు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కృతజ్ఞతలను తెలియజేశారు. ఈమేరకు జిల్లా ఎస్పీ సోమవారం పత్రికాప్రకటనను విడుదల చేశారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించిన ప్రజలు, మీడియాప్రతినిధులు, రాజకీయ పక్షాలకు, అధికారులకు, అనధికారులకు జిల్లా ఎస్పీ ధన్యవాదాలను తెలియజేశారు. ఎలాంటి అల్లర్లు, గొడవలకు వెళ్లకుండా జిల్లా ప్రజలు ప్రశాంతతను కోరుకోవడం అభినందనీయమన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది ముందుంది ఇదే స్ఫూర్తితో విధులను నిర్వర్తించాలనీ జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.



ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ రామరాజు, జేసి సాయికాంత్ వర్మ



కడపలోపోలింగ్ సరళి పరిశీలిస్తున్న ఎస్పీ



పోలింగ్ కేంద్రాలకు వస్తున్న ఉపాధ్యాయినులు



వల్లూరులో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

న్యూస్‌రీల్

16 నుంచి ఉమ్మడిజిల్లాలో వర్షాలు

కడప అగ్రికల్చర్ : వాతావరణశాఖ వారి సూచన మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే) కో-ఆర్డినేటర్ వీరయ్య , వాతావరణశాఖ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. అక్కడక్కడా గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం కూడా ఉందని చెప్పారు. కావున రైతులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం
- ఇంటర్ ఆర్ఐఓ రమణరాజు



కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఇంటర్ ఆర్ఐవో రమణరాజ పేర్కొన్నారు. సోమవారం కడపలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 92 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరీక్షలు 15వ తేదీ ప్రారంభమై ఏప్రిల్ 4న ముగుస్తాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని చెప్పారు. ఒక్క నిమియం ఆసల్యమైనా అనుమతించేది లేదన్నారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాలను ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేసి కడప ఆర్ఐవో కార్యాలయం, ఇంటర్‌బోర్డు కార్యాలయానికి అనుసంధానం చేసినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు హై పవర్ కమిటీతోపాటు ఐదుగురు జిల్లా పరీక్షల కమిటీసభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను, 10 మంది సెంటర్ కస్టోడియన్లను నియమించినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సెల్‌ఫోన్స్, యూట్యూబ్స్ ద్వారా వచ్చే వదంతులు నమ్మొద్దని సూచించారు.

మనసులో ‘నాటు’కుంది



మన తెలుగు సినిమాలోని ‘నాటు..నాటు’పాటకు ఆస్కార్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో గోల్డెన్ గ్లోబ్ అవార్డు లభించడం పట్ల దేశ పౌరులతోపాటు వైఎస్సార్ జిల్లా సినీ అభిమానులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.నాటు పదాన్ని తక్కువగా భావించే సమాజంలో నేడు అచ్చ తెలుగు పదాలతో ఆ పాట విశ్వవ్యాప్తంగా కీర్తి బావుటాన్ని ఎగుర వేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సినీ, నాటక కళాకారులు తమ మనోభావాలు ఇలా తెలియజేస్తున్నారు.
- కడప కల్చరల్

శుభ ప్రారంభం



ఇన్నాళ్లు మనకు దక్కని ఆస్కార్ బహుమతి తెలుగింటికి చేరడం శుభ ప్రారంభంగా భావిస్తున్నా. ఈ పాటతో తెలుగువాడి ‘వాడి-వేడి’ ప్రపంచానికి తెలిసొచ్చింది. భవిష్యత్తులో మరిన్ని ఆస్కార్‌లు లభించే ఆస్కారం కనిపిస్తోంది.
- నీలకంఠ, తెలుగు సినీ దర్శకుడు, కడప

భారతీయ కళాకారులకు తీపి జ్ఞాపిక



‘నాటు’ పాటతో తొలి సారిగా తెలుగు సినీ గీతానికి ఆస్కార్ లభించడం భారతీయ కళాకారులందరికీ తీపిజ్ఞాపకం.ఈ అవార్డు తెలుగు కళాకారులందరికీ లభించినదిగా భావించాలి. - ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, అధ్యక్షుడు, లలితకళల విభాగం, వైవీయూ, కడప

తెలుగు కలానికి దక్కిన గౌరవం



నేడు ప్రపంచం చూపంతా నాటు పాట పైనే. ఈ విజయం ఆరంభమే. తెలుగు సినీ నృత్య గీతాలకు లభించిన సమున్నత గౌరవం. ఇన్నాళ్లు ఊరించిన ఆస్కార్ మన దేశానికి దక్కిన అపురూపమైన సన్నివేశం ఇది. ఆర్ఆర్ఆర్ బృందంతోపాటు రచయిత, సంగీత దర్శకులు, దర్శకులు, నృత్య దర్శకులు, గాయకులకు అభినందనలు.
- నరాల శ్రీనివాసరెడ్డి, సినీ నిర్మాత, ప్రొద్దుటూరు

మాటల్లో చెప్పలేనిది



తెలుగు సినీ రంగంలో పాటకు, సాహిత్యానికి విడదీయరాని బంధం ఉంది. నాడు ఘంటసాల, బాలసుబ్రమణ్యం, ఆరుద్ర, ఏటూరి, సిరివెన్నెల లాంటి వారు వేసిన పునాదులపై నేడు చంద్రబోస్ పాటకు ఆస్కార్ లభించింది. ఈ పురస్కారం ఎప్పుడో రావాల్సి ఉంది. ఆర్ఆర్ఆర్ సినిమా బృందానికి అభినందనలు.
- వివేక్ లంకమల, సినీ యువ నిర్మాత, దర్శకుడు, నందిపల్లె, బద్వేలు

దేశానికి గర్వకారణం



రాయచోటిటౌన్ : అస్కార్ అవార్డుకు ఎంపికైన విజేతలకు రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియచేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెలుగు పాటకు అస్కార్ అవార్డు పొందడం భారతదేశానికి గర్వకారణమన్నారు.గీతరచయిత చంద్రబోస్, స్వరకర్త కీరవాణి, దర్శకుడు రాజమౌళి, గాయకులు రాహుల్ సిప్లీగంజ్, కాలభైరవలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

టీడీపీ కవ్వింపు చర్యలు!



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి



లింగాల మండలంలో తన అనుచరులతో వస్తున్న బీటెక్ రవి

- లింగాలలో అనుచరులతో హంగామా చేసిన మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి
- 144 సెక్షన్ ఉల్లంఘించి హల్‌చల్ చేసిన పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి
- రాజంపేటలో బత్యాల చెంగల్‌రాయుడు హంగామా

సాక్షి ప్రతినిధి, కడప : ఓటమికి ముందే సాకుల కోసం తెలుగుదేశం పార్టీ కవ్వింపు చర్యలకు పాల్పడింది. ఏమి లేకపోయినా అనవసర రాద్ధాంతం చేస్తూ అభాండాలు వేసేందుకు ముందస్తు పథకం ప్రకారం వ్యవహరించారు. ప్రశాంత పోలింగ్ నమోదవుతున్న తరుణంలో లింగాలలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి హంగామా చేశారు. రాళ్లు చేతిలో పట్టుకొని వచ్చిన అనుచరులు సవాళ్లు విసురుతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. జిల్లా కేంద్రమైన కడపలో 144 సెక్షన్ అతిక్రమించి పార్లమెంటు ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి సైతం అదేతీరు ప్రదర్శించారు.

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఘోర పరాభవం తప్పడం లేదని విశ్లేషకులు మొదటి నుంచి వెల్లడిస్తున్నారు. పోలింగ్ నాడిని పసిగట్టిన టీడీపీ నేతలు ఉదయం నుంచి ఓటమికి ముందే సాకులు వెతికే పనిలో నిమగ్నమయ్యారు. అందుకోసం ప్రత్యేక ప్రణాళిక మేరకు టీడీపీ నేతలు అనుచరులతో కలిసి గుంపులుగా వెళ్తూ హంగామా చేశారు. లింగాలలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అనుచరులను వెంటేసుకొని నడుచుకుంటూ వస్తుండగా రాళ్లు చేతిలో ధరించిన అనుచరులు వైఎస్సార్‌సీపీ నేతలను దూషిస్తున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అలాగే పోలింగ్ జనరల్ ఏజెంట్‌గా ఉన్న టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి అదే విధంగా వ్యవహరించారు. మున్సిపల్ ఉర్దూ బాలుర హైస్కూల్ వద్దకు అనుచరవర్గంతో చేరుకున్నారు. వారంతా సెల్‌ఫోన్లు చిత్రీకరిస్తూ పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉండగా అంతమందిని ఎలా అనుమతిస్తారని అధికారులను ప్రశ్నించడంతో టీడీపీ నేతలు వెంటనే వాగ్వివాదానికి దిగారు. ఇరు వర్గాల మధ్య తోపులాట నెలకొంది. తొండూరులో మధ్యాహ్న సమయంలో ఓటింగ్ సరళి సక్రమంగా జరుగుతుండటంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఘర్షణకు దిగారు అదేవిధంగా రాజంపేట గర్ల్స్ హైస్కూల్‌లో పోల్ క్లోజింగ్ సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడు తన వర్గీయులతో పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. పోల్‌టైట్ అయిపోయిందని, ఇప్పుడెలా పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లడానికి అనుమతి ఇస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి పోలీసులను ప్రశ్నించారు. ఒక్కమారుగా టీడీపీ నేతలు రెచ్చిపోయారు. దీంతో పోలింగ్ గేట్ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

అధిష్టానం మెప్పు కోసమే..

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా టీడీపీ నేతల హంగామా కేవలం అధిష్టానం మెప్పుకోసమేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఆయా నేతలు ఎవరికి వారు పరపతి పెంచుకునే చర్యల్లో భాగంగానే ఏమీ లేకపోయినా ఎగిరెగిరి పడినట్లు పలువురు వివరిస్తున్నారు. పులివెందులలో తాము వీరోచితంగా పోరాటం చేశామని టీడీపీ అధిష్టానం వద్ద మెప్పు పొందేందుకే లింగాలలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి గొడవ పెట్టుకున్నారని పరిశీలకులు వివరిస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి నియామకాన్ని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తెరవెనుక వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో ఎన్నికల స్టంట్‌కు తెరలేపినట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. జిల్లా కేంద్రంలో పోలింగ్ కట్టడి తాను మాత్రమే చేయగల్గిగానని శ్రీనివాసులరెడ్డి చెప్పుకునేందుకు మాత్రమే తన హంగామా కన్పించిందని ఆ పార్టీ నేతలే వెల్లడిస్తున్నారు. రాజంపేటలో బత్యాల చెంగల్‌రాయుడులో కూడా ఆదే వైఖరి కన్పించిందని పలువురు వివరిస్తున్నారు. గొడవలు కావాలని టీడీపీ నేతలు భావించినా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఆయా నేతలకు జీర్ణించుకోలేని అంశంగా మారింది.



రాజంపేట: పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బత్యాల చెంగల్‌రాయుడు



తొండూరు: నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

క్లుప్తంగా

చౌక బియ్యం పట్టివేత

మైదుకూరు : మండల పరిధిలోని బసవాపురం సమీపంలో మైదుకూరు – బద్వేలు రహదారిలో విజిలెన్స్ అధికారులు 30 టన్నుల చౌక బియ్యాన్ని పట్టుకున్నారు. పలు గ్రామాల్లో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన బియ్యాన్ని మైదుకూరుకు చెందిన పోతుగంటి గురప్ప, పసల మునెయ్య, మాచనూరు సుధీర్, తుపాకుల పవన్ కళ్యాణ్ సేకరించారు. వారు లారీలో 600 బస్తాలలో రవాణా చేస్తుండగా పట్టుకున్నట్టు అర్బన్ ఎస్ఐ ఘణ మద్దిలేటి తెలిపారు. బియ్యం, లారీ, ఎస్కార్ట్‌గా ఉన్న కారు రూ.27.95 లక్షల విలువ చేస్తాయని, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అలవెన్స్ విడుదలపై హర్షం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అలవెన్స్‌లు విడుదల చేయడంపై వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.బాబా ఫకృద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. కండక్టర్, డ్రైవరు, మెకానిక్‌లకు సెప్టెంబరు, అక్టోబరు, నవంబరుకు సంబంధించిన నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు రాష్ట్ర వ్యాప్తంగా రూ.150 కోట్లు విడుదల చేశారన్నారు. జిల్లాలో దాదాపు రూ.3 కోట్లు అలవెన్సు రూపంలో అందజేస్తున్నారన్నారు. కడప డిపోలో దాదాపు రూ.60 లక్షలు ఉద్యోగులకు విడుదలయ్యాయన్నారు.

ముగిసిన రబీ


రబీ సీజన్‌లో సాగైన శనగ పంట

- జిల్లాలో 1,24,811 హెక్టార్లలో సాగు
- అత్యధికంగా 71,824 హెక్టార్లలో శనగ పంట
- ముగిసిన ఈ క్రాపు, ఈకేవైసీ నమోదు ప్రక్రియ
- ఆర్‌బీకేల్లో జాబితా ప్రదర్శన, గ్రామ సభల నిర్వహణ

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి చివరి నాటికి రబీ సీజన్ ముగిసింది. జిల్లాలో ఉద్యాన, వ్యవసాయ పంటలు కలిపి 1,24,811 హెక్టార్లలో సాగయ్యాయి. ఇందులో వ్యవసాయానికి సంబంధించి సాధారణ సాగు విస్తీర్ణం 1,50,812 హెక్టార్లు ఉండగా, రబీ సీజన్ ముగిసే నాటికి 1,07,807 హెక్టార్లలో పలు పంటలు సాగై 71.48 శాతంగా నమోదైంది. ఉద్యాన పంటలకు సంబంధించి సాధారణ సాగు 25,263.5 హెక్టార్లకు గాను రబీ సీజన్ ముగిసే నాటికి 17,004.27 హెక్టార్లలో పలు ఉద్యాన పంటలు సాగయ్యాయి. దీంతోపాటు 3,11,008.06 ఎకరాల్లో ఈ క్రాపు పూర్తి అయ్యి 99.93 శాతంగా నమోదు అయింది. అలాగే ఈకేవైసీకి సంబంధించి 3,07, 914 హెక్టార్లలో పూర్తి చేసి 99.13 శాతంగా నమోదైంది.

అత్యధికంగా శనగ, వరి పంటలు

జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి అత్యధికంగా శనగ, వరి పంటలు సాగయ్యాయి. ఇందులో శనగ పంట 71,824 హెక్టార్లలో సాగు కాగా 9573 హెక్టార్లలో వరి పంట సాగైంది. జొన్న పంట 3287 హెక్టార్లలో, 763 హెక్టార్లలో సజ్జలు, 1013లో మొక్కజొన్న, 22లో రాగి, 1369 పెసలు, 11953 మినుము, 174 ఉలవలు, 3545 వేరుశనగ, 1086 నువ్వులు, 1430 సన్‌ఫ్లవర్, 808 కుసుమలు, 819 పత్తి, 64 హెక్టార్లలో పొగాకు పంటలను సాగు చేశారు.

ఆర్‌బీకేల్లో పంట నమోదు జాబితా ప్రదర్శన

జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించారు. రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఈ క్రాపు నమోదు గడువు ముగిసే నాటికి 3,11,008.06 ఎకరాల్లో ఈ క్రాపు నమోదు పూర్తి అయ్యింది. ఇందుకు సంబంధించిన జాబితాను ఈ నెల 13వ తేదీ నుంచి 17 వరకు అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించారు. ఇందుకు సంబంధించి గ్రామ సభలు కూడా ప్రారంభమయ్యాయి. రైతులు ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్స్‌లకు తెలియజేస్తున్నారు.

జాబితాను రైతులు సరిచూసుకోవాలి



జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి చివరితో రబీ సాగు ముగిసింది. ఇందుకు సంబంధించి సాగైన పంటల వివరాలన్నింటికీ వ్యవసాయ సిబ్బంది ఈ క్రాపు నమోదు పూర్తి చేశారు. దీంతోపాటు ఈకేవైసీ కూడా వేయించారు. ప్రస్తుతం సంబంధిత జాబితాను సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించారు. ఇందులో ఏవైనా సమస్యలుంటే వ్యవసాయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాలి.

- అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

పోలీసు శాఖ సంక్షేమంలో టెండర్ల ఆహ్వానం

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



కడప అర్బన్ : జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంక్షేమంలో భాగంగా వివిధ కేటగిరిలకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

■ కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలోని ఉమేష్ చంద్ర కల్యాణ మండపంలో జరిగే ఫంక్షన్‌లకు అలంకరణ చేయుటకు డెకరేటర్లకు ఈ నెల 22న ప్రత్యక్ష వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు అవగాహన ఒప్పందం (ఎం.ఓ.యు)కోసం 22న ఉదయం 10 గంటలకు ఉమేష్ చంద్ర కల్యాణ మండపంలో నిర్వహించనున్న వేలంలో ఆసక్తి కలిగిన డెకరేటర్లు పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు.

■ కడపలోని పోలీస్ వెల్ఫేర్ ఫార్మసీకి కావాల్సిన మందులను సరఫరా చేసేందుకు అవగాహనా ఒప్పందం చేసుకునేందుకు ఈ నెల 14న ఉదయం 10 గంటల నుంచి 20 సాయంత్రం 5 గంటల వరకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ కార్యాలయం సమీపంలో వున్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన టెండరు బాక్స్‌లో తమ సీల్డ్ టెండర్లను దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు.

■ కల్పతరు పోలీస్ వెల్ఫేర్ స్టోర్స్‌కు ప్యాక్ చేసిన కిరాణా వస్తువులు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, హోం అప్లయన్సెస్, కాస్మోటిక్స్ సరఫరాకు ఈనెల 14 నుంచి 20 వరకు సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు. ఈ సీల్డ్ టెండర్లను కూడా 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బాక్స్‌లలో దాఖలు చేయాలని ఎస్పీ తెలిపారు.

ఏసీబీ కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు

రూ.5 లక్షల జరిమానా

కడప అర్బన్ : అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) కేసులో ఓ అధికారికి నాలుగేళ్ల జైలు శిక్ష పడింది. కర్నూలు ప్రత్యేక న్యాయమూర్తి కడప రేంజ్ క్రైమ్ నంబర్: 55/2013లో నిందితుడైన అప్పటి అనంతపురం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బసిరెడ్డి ఓబుల్‌రెడ్డికి నాలుగేళ్లపాటు కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5 లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఆ కేసులో ఆదాయ వనరులకు మించి అక్రమాస్తులు ఉన్నట్లు నిరూపించి, దోషిగా నిర్ధారించారు. ఒకవేళ జరిమానా కట్టకపోతే మరో ఐదు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు. నిందితుడికి సంబంధించిన అక్రమ ఆస్తులను రాష్ట్రానికి జప్తు చేయాలని ఆదేశించారు. వీటి విలువ సుమారు రూ.42,28,824గా గుర్తించారు. ప్రస్తుతం బసిరెడ్డి ఓబుల్‌రెడ్డి పదవీ విరమణ పొంది వున్నారు.ఈ కేసును ఏసీబీ తరపున కోర్టులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.ఎస్.రామభగవాన్ వాదించారు. ఈ కేసుకు సంబంధించిన పత్రికా ప్రకటన విజయవాడ అవినీతి నిరోధక శాఖ డీజీ ఆదేశాల మేరకు విడుదల చేసినట్లు ఏసీబీ కడప డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

రూ.300 కోసం జరిగిన గొడవలో..


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లెలో ఆదివారం రూ.300 కోసం దాడి చేసి హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులను సోమవారం అరెస్టు చేశారు. సిద్దవటం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు వివరాలు వెల్లడించారు. ఉప్పరపల్లె గ్రామానికి చెందిన భీమిశెట్టి లక్ష్మీనరసింహులు అతని పెద్దమ్మ లక్షుమమ్మ ఇంట్లో పెరిగిన టేకు చెట్లను కొట్టించేందుకు మండలంలోని మదవరం–1 పంచాయతీ ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీకి చెందిన పత్తూరు శ్రీనివాసులు, అతని ఇద్దరు కుమారులైన నాగేంద్ర, మణీంద్రతో రూ.600కు బేరం కుదుర్చుకున్నారు. చెట్లు కొట్టిన తర్వాత వీరు అదనంగా రూ.300 అడిగారు. అదనంగా ఎందుకు ఇవ్వాలని లక్ష్మీనరసింహులు ప్రశ్నించాడు. పై ముగ్గురు అతనితో వాగ్వాదానికి దిగారు. లక్ష్మీనరసింహులును శ్రీనివాసులు పట్టుకోగా.. మణీంద్ర రించ్ స్క్రూడ్రైవర్‌తో తలపై పొడిచాడు. వెంటనే నాగేంద్ర ఇనుప వాటర్‌పైప్‌తో కొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి ఆదిలక్షుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిద్దవటం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులు పత్తూరు శ్రీనివాసులు, మణీంద్ర, నాగేంద్రను సోమవారం సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న మలినేనిపట్నం గ్రామం వద్ద అరెస్టు చేశారు. హత్యకు వినియోగించిన రింగ్ స్క్రూడ్రైవర్, ఇనుప వాటర్ పైప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరు పరిచారు. సమావేశంలో ఎస్ఐ తులసీనాగ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రాజు, పోలీసులు పాల్గొన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసినందుకు కడప సబ్‌డివిజన్ అధికారి బి.వెంకట శివారెడ్డి, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, సిద్దవటం ఎస్ఐ తులసీ నాగప్రసాద్, పోలీసులను జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ప్రియురాలు, వారి బంధువులు హత్య చేశారని భార్య ఆరోపణ


రెడ్డప్ప (ఫైల్)

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం నగరిగుట్ట ఎస్సీ కాలనీ సమీపంలోని ఓ ఇంటిలో సోమవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల పట్టణం ఎర్రగుడిపల్లెకు చెందిన నాగరాజు, శివమ్మల కుమార్తె భారతిని రెండేళ్ల క్రితం శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లె మండలం రామాపురం గ్రామానికి చెందిన రెడ్డప్ప(22)తో వివాహం చేశారు. వీరి కాపురం ఏడాది పాటు సంతోషంగా సాగింది. తర్వాత పులివెందుల పట్టణం నగరిగుట్టకు చెందిన ఓ మహిళతో రెడ్డప్ప వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. రెడ్డప్ప లారీ డ్రైవర్‌గా పని చేస్తూ అక్కడికి, ఇక్కడికి వచ్చి వెళ్లేవాడని భార్య భారతి బంధువులు ఆరోపించారు. ఆరు నెల క్రితం పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో అధికారులు, పెద్ద మనుషుల సమక్షంలో ప్రియురాలి ఇంటికి వెళ్లకుండా ఉండాలని తీర్మానం చేశారు. అయినా రెడ్డప్ప తన ప్రేమ వ్యవహారాన్ని నడుపుతూ వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ప్రియురాలు ఇంట్లో రెడ్డప్ప చనిపోయాడు. ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రియురాలు, వారి బంధువులు చెబుతున్నారు. భార్య భారతి, బంధువులు మాత్రం రెడ్డప్పను ప్రియురాలు, వారి బంధువులే చంపేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భర్త మృతి చెందడంతో ఆసుపత్రిలో భార్య భారతి, వారి బంధువుల రోదనలు మిన్నంటాయి. బాధితురాలు భారతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


రవిచంద్ర మృతదేహం

మదనపల్లె : మదనపల్లె పట్టణంలో సోమవారం వాటర్ ట్యాంకర్ ఢీకొనడంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం తుమ్మకూరు జిల్లా కొడిగెనహళ్లి మండలం పార్థహళ్లికి చెందిన హనుమంతప్ప కుమారుడు రవిచంద్ర(28) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చాడు. కదిరి రోడ్డులోని బంధువుల ఇంటికి నడుచుకుని వెళ్తుండగా పట్టణంలోకి వస్తున్న నీళ్ల ట్యాంకర్ రవిచంద్ర వెనుకవైపున దూసుకెళ్తూ ఢీకొంది. ఆయన తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్ఐ రామాంజనేయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6 ఎర్రచందనం దుంగల స్వాధీనం

నిందితుడి అరెస్ట్


ఎర్రచందనం దుంగలు, నిందితుడు, వాహనంతో అటవీ శాఖ అధికారులు

పీలేరు : ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. వివరాలిలా వున్నాయి. కలికిరి – కందూరు మార్గంలో ఎర్రచందనం తరలిస్తున్నారన్న సమాచారంతో అటవీ సిబ్బంది కందూరు వంక వద్ద నిఘా ఉంచారు. సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. అతివేగంగా వచ్చిన వాహనాన్ని సిబ్బంది ఆపేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ ఆపకుండా ముందుకు పోవడంతో ఫారెస్ట్ సిబ్బంది వాహనాన్ని చుట్టిముట్టి పట్టుకున్నారు.

వాహనాన్ని పరిశీలించగా ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. ఆ వాహనం, 175 కేజీల బరువు గల 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడులోని వేలూరు జిల్లా పించమందైకు చెందిన దొరస్వామిని అరెస్ట్ చేయగా రమేష్, సురేష్, గణేష్, కృష్ణ, రామ అనే నిందితులు పరారైనట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు. ఈ దాడిలో అటవీ సిబ్బంది ప్రతాప్, కుప్పుస్వామి, ప్రభుతేజ, చరణ్ పాల్గొన్నారు.

పాపం పండింది.. శిక్ష పడింది


మౌలాలి (ఫైల్)

తంబళ్లపల్లె/బి.కొత్తకోట : చేసిన నేరం పాపమై పండింది.. నిందితుడికి జైలు శిక్ష పడింది. వివాహేతర బంధంలో తలెత్తిన అనుమానంతో ప్రియురాలిని హత్య చేసి.. ఈ విషయాన్ని దాచేందుకు ఆమె తల్లిని కూడా చంపేశాడు. వరసకు కూతురైన మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ కేసులో నిందితునికి చిత్తూరు స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి సోమవారం శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసును దర్యాప్తు చేసిన అప్పటి ములకలచెరువు సీఐ పి.సురేష్‌కుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

వివాహేతర బంధంతో మొదలై..

తంబళ్లపల్లె మండలం గోవిందువారిపల్లెకు చెందిన గంగులమ్మకు సరళమ్మ కుమార్తె. ఈమెకు ముగ్గురు కుమార్తెలు. సరళమ్మ భర్త 8 ఏళ్ల క్రితం మృతి చెందడంతో తల్లి గంగులమ్మ ఇంటిలో ఉంటోంది. భూ సమస్యకు సంబంధించి సరళమ్మ తరచూ తహసీల్దార్ కార్యాలయానికి వస్తుండేది. ఈ నేపథ్యంలో గంగిరెడ్డిగారిపల్లెకు చెందిన సయ్యద్‌మౌలాలి (47)తో వివాహేతర బంధం ఏర్పడింది. వారు కలిసి నివసించే వారు. వివాహేతర బంధం విషయం అందరికీ తెలియడంతో కాపురాన్ని ఏటిగడ్డతండాకు మార్చారు. నాలుగేళ్లు అక్కడ ఉండి గ్రామానికి సమీపంలో రేకులషెడ్డును నిర్మించుకుని కాపురం ఉంటూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో సరళమ్మ ఫోన్‌లో ఎవరో వ్యక్తితో మాట్లాడటం తెలిసి మాట్లాడవద్దని మౌలాలి చెప్పినా వినలేదు. 2020 సెప్టెంబర్ 29న వేరుశనగ పొలంలోకి పందులు వస్తున్నాయని సరళమ్మ, మౌలాలి కాపలా కాస్తూ మంచంపై పడుకున్నారు. వేరే వ్యక్తులతో ఎందుకు మాట్లాడుతున్నావని మౌలాలి ప్రశ్నించడంతో.. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపంతో మౌలాలి కట్టెతో సరళమ్మ ఎడమ పక్క కణితిపై కొట్టడంతో కింద పడిపోయింది. చనిపోయిందని నిర్ధారించుకుని మృతదేహాన్ని సమీపంలోని పెద్దేరు ప్రాజెక్టులోకి ట్యూబ్‌పై తీసుకెళ్లి శవం తేలకుండా బండరాళ్లను కట్టి నీటిలోకి పడేశాడు. ఉదయం కుమార్తె ఎక్కడని తల్లి గంగులమ్మ ప్రశ్నించగా అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లిందని చెప్పి నమ్మించే ప్రయత్నం చేశాడు. 2020 అక్టోబర్ 1న సరళమ్మ ఎక్కడని గంగులమ్మ గట్టిగా నిలదీసి పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో అదే రోజు రాత్రి ఆమెకు మద్యం తాగించాడు. ఇంటి బయట నిద్రిస్తున్న గంగులమ్మ అర్ధరాత్రి దాటాక ఆమె చీర కొంగుతో గొంతుకు బిగించి హత్య చేశాడు. చనిపోయిన గంగులమ్మ మృతదేహాన్ని బైక్‌పై తీసుకెళ్లి గంగచెరువులో చెట్టు మొదలుకు చీరను కట్టి నీటిలో పడేశాడు. మరుసటి రోజు తల్లి, అవ్వ ఎక్కడున్నారని మౌలాలిని సరళమ్మ కుమార్తెలు ప్రశ్నించగా.. కరోనా సోకి ఆస్పత్రికి వెళ్లారని నయమయ్యాక వస్తారని నమ్మించాడు. ముగ్గురు పిల్లలను కర్ణాటకలోని గానిపల్లెకు తీసుకెళ్లి అక్కడ అద్దె ఇంటిలో ఉంచాడు. అక్కడ సరళమ్మ పెద్ద కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడి వేధించాడు. చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయం బాహ్యాప్రపంచానికి తెలియకుండా పోయింది. పీలేరులోని ఏటిగడ్డ గ్రామానికి చెందిన బంధువులు గోవిందువారిపల్లెకు వచ్చి గుంగులమ్మ గురించి ఆరా తీయగా కనిపించలేదు. దీనితో పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి తంబళ్లపల్లె ఎస్ఐ సహదేవి అదృశ్యం కేసు నమోదు చేశారు. దర్యాప్తులో హత్యలుగా వెలుగు చూడటంతో సీఐ సురేష్‌కుమార్ దర్యాప్తు ప్రారంభించారు. తర్వాత బాలికపై లైంగిక దాడి వెలుగులోకి రావడంతో అప్పటి మదనపల్లె డీఎస్పీ రవిమనోహరాచారి దర్యాప్తు చేశారు. జంట హత్యలు, బాలికపై అత్యాచారానికి పాల్పడినట్టు నిర్ధారించి, మౌలాలిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. మౌలాలికి చనిపోయేంత వరకు జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ.. బాధిత బాలికకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.